# ‘పల్లా’కే జనగామ ‘పట్టం’..

- ఎన్నికల బరిలో రాజేశ్వర్‌రెడ్డి
- బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఖరారు
- హైదరాబాద్‌లో నియోజకవర్గ ముఖ్యనేతలతో సమావేశం
- పల్లా గెలుపు బాధ్యత ముత్తిరెడ్డికి అప్పగింత
- గులాబీ శ్రేణుల్లో నయా జోష్
- నేడు జనగామలో నియోజకవర్గ స్థాయి సమన్వయ సమావేశం
- హాజరు కానున్న మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి, అభ్యర్థి పల్లా, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి


హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

జనగామ, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ) : జనగామ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్సీ డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేరు ఖరారైంది. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన పార్టీ ముఖ్యనేతల సమన్వయ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ జనగామలో పల్లా గెలుపు బాధ్యతలను స్థానిక ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి అప్పగించారు. అధిష్టానం ఆదేశం మేరకు పార్టీ అభ్యర్థి విజయం కోసం ముందుండి పని చేస్తానని ముత్తిరెడ్డి స్పష్టం చేశారు. జనగామ బీఆర్‌ఎస్ అభ్యర్థిత్వంపై ఇన్నాళ్ల ఉత్కంఠకు తెర పడింది. సీఎం కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తూ వివాద రహితుడిగా పేరుండి విద్యాధికుడైన పల్లాకు అధిష్టానం ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించింది. అధినేతకు విధేయుడిగా ఉంటూ రెండు పర్యాయాలు పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలుపొందిన ఆయన జనగామ జనరల్ స్థానం నుంచి అసెంబ్లీకి తొలిసారి పోటీ చేస్తున్నారు. కాగా, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు బోడకుంటి వెంకటేశ్వర్లు, నారదాసు లక్ష్మణ్ రావు హాజరైన సమావేశంలో ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై గులాబీ ముఖ్యనేతలకు యువనేత కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. జనంలో తిరుగుతూ ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధిలో మమేకమవుతున్న పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ స్థానాలకు గెలుపే లక్ష్యంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి పేర్లను ఇప్పటికే ప్రకటించగా, వివిధ కారణాలతో జనగామ నియోజకవర్గ అభ్యర్థిత్వాన్ని పెండింగ్‌లో పెట్టిన అధిష్టానం ఎట్టకేలకు పల్లాకు పట్టం గట్టింది. జనగామ జిల్లాలోని మూడు స్థానాల్లో గెలుపు గుర్రాలను బరిలో నిలిపిన కేసీఆర్ మరోసారి దమ్మున్న నేతగా నిలిచారు. పల్లా పేరును ప్రకటించడం సహా ఈనెల 11న (బుధవారం) ఉదయం 11గంటలకు జనగామలోని వికాస్‌నగర్ వద్ద నిర్వహించే బీఆర్‌ఎస్ నియోజకవర్గ స్థాయి సమన్వయ సమావేశంలో మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి హాజరు కానున్నారు. మరోవైపు ఈనెల 16న జనగామలో ఎన్నికల సమర శంఖారావాన్ని పూరించేందుకు సీఎం కేసీఆర్ రానుండడంతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్ నెలకొన్నది. పల్లా అభ్యర్థిత్వంతో గులాబీ పార్టీకి జిల్లాలోని మూడు సీట్లు గెలిచి ‘తీన్‌మార్’ కొట్టేందుకు సిద్ధమైంది. ఆయా నియోజకవర్గాల్లో జనంలో పట్టున్న వారికే బీఆర్‌ఎస్ అభ్యర్థులుగా పట్టం గట్టడడంతో గెలుపు ఖాయమైనా..మెజార్టీ లక్ష్యంగా ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. మరోపక్క కాంగ్రెస్, బీజేపీ మాత్రం అభ్యర్థుల విషయంలో ఎటూ తేల్చుకోలేకపో తున్నాయి. గ్రూపు తగాదాలతో సిగపట్లు పడుతుంటే పార్టీ క్యాడర్‌లో తీవ్ర నైరాశ్యం నెలకొన్నది.

### ఉద్యమనేత నుంచి ఎమ్మెల్యే అభ్యర్థి వరకు..

1963 నవంబరు 4న ఉమ్మడి వరంగల్ జిల్లా సోడషాపల్లి గ్రామంలో పల్లా రాఘవరెడ్డి– అనసూయ దంపతులకు రాజేశ్వర్‌రెడ్డి జన్మించారు. సూర్యదేవర నీలిమతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పదో తరగతి వరకు హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం మల్లికుదుర్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివారు. ఖమ్మం ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లో డిగ్రీ పూర్తి చేసి ఫిజిక్స్‌లో ఓయూ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. విద్యార్థి దశ నుంచి ఉద్యమ నాయకుడిగా పని చేసి అధినేత పిలుపుతో 2014లో బీఆర్‌ఎస్‌లో చేరారు. పల్లా పార్టీ ఆదేశాలతో 2015లో నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసి తొలిసారి శాసన మండలి సభ్యుడిగా గెలుపొందారు. 2016లో ప్రభుత్వ విప్‌గా నియామకమయ్యారు. 2017లో బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, 2018లో శాసనసభలో పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యుడు, 2019లో రైతు బంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. 2021లో రెండోసారి బీఆర్‌ఎస్ నుంచి మరోసారి ఎమ్మెల్సీగా పోటీ చేసి గెలుపొందారు.

**పూర్తి పేరు :** పల్లా రాజేశ్వర్‌రెడ్డి
**తల్లిదండ్రులు :** పల్లా రాఘవరెడ్డి – అనసూయ
**పుట్టిన తేదీ :** 04-11-1963
**నివాసం :** జూబ్లీహిల్స్, హైదరాబాద్
**స్వస్థలం :** సోడషాపల్లి గ్రామం, హనుమకొండ జిల్లా.
**విద్యార్హతలు :** పీహెచ్‌డీ
**భార్య :** సూర్యదేవర నీలిమ
**పిల్లలు :** ఇద్దరు కుమారులు

**రాజకీయ ప్రవేశం :**

– ఉస్మానియా యూనివర్సిటీలో 1985-87 వరకు ఎస్‌ఎఫ్‌ఐ కార్యదర్శి, 1988-91 వరకు ఎస్‌ఎఫ్‌ఐ హైదరాబాద్ నగర కార్యదర్శిగా బాధ్యతలు.
– 2014లో బీఆర్‌ఎస్ పార్టీలో చేరిక, లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ నుంచి పోటీ చేసి ఓటమి.
– 2015లో బీఆర్‌ఎస్ నుంచి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసి తొలిసారిగా గెలుపు.
– 2016లో ప్రభుత్వ విప్‌గా నియామకం.
– 2017లో బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియామకం.
– 2018లో శాసనసభలో పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యుడిగా నియామకం.
– 2019లో రైతు బంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు.
– 2021లో బీఆర్‌ఎస్ నుంచి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసి రెండోసారి గెలుపు.

# అవార్డులు బాధ్యతను పెంచుతాయి..

- డీఈవో కే రాము
- ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

జనగామ చౌరస్తా, అక్టోబర్ 10 : అవార్డులు బాధ్యతను పెంచుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి కే రాము అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సాయిరాం కన్వెన్షన్ హాల్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో 72 మంది ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈవో, విశిష్ట అతిథులుగా పెద్ది వెంకట్ నారాయణ గౌడ్, గంటా రవీందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ వారి సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు తోడ్పడాలని సూచించారు. వెంకట్ నారాయణ గౌడ్, గంటా రవీందర్ మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను ప్రశంసాపత్రాలతో పాటు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏసీజీఈ టీ రవికుమార్, ఎంఈవో చంద్రారెడ్డి, నోడల్ అధికారులు రాజేందర్, విష్ణుమూర్తి, కొంరయ్య, వెంకట్‌రెడ్డి, సెక్టోరియల్ అధికారులు తోట రాజు, క్వాలిటీ కోఆర్డినేటర్ బీ శ్రీనివాస్, బాలిక విద్య జిల్లా సమన్వయకర్త గౌసియా బేగం, నర్సింహారావు, ఏపీవో శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

### బచ్చన్నపేట నుంచి 9 మంది ఎంపిక

బచ్చన్నపేట : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు మంగళవారం జిల్లా కేంద్రంలో డీఈవో రాము సన్మానించారు. బచ్చన్నపేట మండలం నుంచి 9 మంది ఉపాధ్యాయులు ఉత్తములుగా ఎంపికయ్యారు. అందులో భాస్కరుని పృథ్వీరాజ్ (కట్కూర్) ఝాన్సీ లక్ష్మీబాయి (కొడవటూరు), జీవరత్నం (ఇటికాలపల్లి), బీ వెంకటేశ్వర్లు (ఇటికాలపల్లి), శైలజ (బోనకొల్లూరు), మదూరి వెంకటేశ్ (బండనాగారం), సుధాకర్ (బచ్చన్నపేట), ఖలీల్ అహ్మద్ (బచ్చన్నపేట) ఉన్నారు. ఇదిలా ఉండగా దేవరుప్పుల మండలం మొండిచింత తండా పాఠశాల నుంచి రాయబారపు రాజేంద్రప్రసాద్ అవార్డు అందుకున్న వారిలో ఉన్నారు.


జనగామ చౌరస్తా : జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులతో డీఈవో రాము, తదితరులు


అవార్డు స్వీకరిస్తున్న ఉపాధ్యాయుడు పృథ్వీరాజు

## నేడు ‘పల్లా’ భారీ బైక్ ర్యాలీ

### కొమురవెల్లి టు జనగామ..

బచ్చన్నపేట, అక్టోబర్ 10 : జనగామ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి నేడు సిద్దిపేట జిల్లా కొమురవెల్లికి రానున్నారు. అక్కడ పూజలు చేసిన అనంతరం బచ్చన్నపేట మీదుగా జనగామకు భారీ బైక్ ర్యాలీ చేపట్టనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపారు. ఎట్టకేలకు మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో జనగామ పంచాయితీకి తెరపడింది. అందరిని ఒకే వేదిక మీదికి తీసుకొచ్చి పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించగా రెండు వర్గాల వారు అంగీకరించారు. బైక్ ర్యాలీని కార్యకర్తలు, నాయకులు విజయవంతం చేయాలని కోరారు.

## 16 నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

జనగామ చౌరస్తా, అక్టోబర్ 10 : జిల్లాలో ఓపెన్ టెన్త్, ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 26 వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈవో కే రాము మంగళవారం తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఇంటర్‌కు ధర్మకంచలోని జడ్పీ పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పదో తరగతి పరీక్షలకు 67 మంది, ఇంటర్ పరీక్షలకు 96 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు డీఈవో పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు పదో తరగతి వారికి, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల ఇంటర్ విద్యార్థులకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. హాల్ టికెట్ల కోసం విద్యార్థులు ప్రవేశం పొందిన స్టడీ సెంటర్ నుంచి లేదా www.telanganaopenschool.org వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఈవో సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీందర్ గౌడ్

## ఘనంగా ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

జనగామ చౌరస్తా, అక్టోబర్ 10 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏబీవీ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ నర్సయ్య అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీందర్ గౌడ్, విశిష్ట అతిథిగా ప్రముఖ సైక్రియాట్రిస్ట్ డాక్టర్ జీ సిద్ధారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రవీందర్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలని సూచించారు. సమాజాన్ని మార్చగలిగే శక్తి కేవలం విద్యార్థులు, యువతకు మాత్రమే ఉందన్నారు. ప్రతిఒకరు మానసిక ఒత్తిడికి లోను కాకుండా ముందుకు సాగాలని తెలిపారు. మెదడుకు సరైన శిక్షణనందిస్తే అది అనేక అద్భుతాలను సృష్టిస్తుందని పేర్కొన్నారు. మానసిక సమస్యలున్న వారు 14416 టెలీమానస్ నెంబర్‌కు ఫోన్ చేసి అవసరమైన సహాయం పొందొచ్చని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రవిందర్ తెలిపారు. ప్రముఖ సైక్రియాట్రిస్ట్ డాక్టర్ జీ సిద్ధారెడ్డి మాట్లాడుతూ మానసిక ఆరోగ్యాన్ని పొందడం అందరి సార్వత్రిక హక్కు అని పేర్కొన్నారు. మద్యపానం, ధూమ పానం, మాదక ద్రవ్యాల వాడకం, సోషల్ మీడియా వంటి ప్రభావాలు ఆత్మహత్యకు ప్రేరేపకాలుగా పనిచేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కలువల శ్రీనివాస్, ఏవో సులేమాన్, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్లు అనగాని శ్రీనివాస్, డాక్టర్ వెంకట్‌రెడ్డి, మహిళా సాధికారిక విభాగం కోఆర్డినేటర్ శైలజ, రాజేశ్, డాక్టర్ రవి ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**VIKAS COLLEGE OF PHARMACY**
Vikas Nagar, Siddipet Road, Jangaon-506167, Jangaon (Dist.), T.S.
Approved by PCI, New Delhi and Affiliated to Kakatiya University, Warangal.

**NOTIFICATION FOR B-CATEGORY ADMISSIONS IN B. PHARMACY & M.PHARMACY FOR THE ACADEMIC YEAR 2023-24**

| College Code | Course | Branch | Total Intake | B-Category |
|---|---|---|---|---|
| VKAS | B.Pharmacy | Pharmacy | 100 | 30 |
| VKAS1 | M.Pharmacy | Pharmacology | 15 | 04 |
| | | Pharmaceutics | 15 | 04 |
| | | Pharmaceutical Analysis | 15 | 04 |

Interested and Eligible candidates are informed to obtain Application from College Office on all working days from 09:30 am to 04:30 pm. Submit the filled in applications on or before **20-10-2023 for B.Pharmacy** and **16-10-2023 for M.Pharmacy.** Admissions will be made as per the guidelines and regulations issued by Government of Telangana and Competent authority from time to time.
★ Application Fee : Nil
★ Registration Fee: Rs. 2500/- to be paid along with Tuition Fee by the admitted candidates.
**Contact : 9396733345, 9346735125, 9885116565**
Sd/- **CHAIRMAN & CORRESPONDENT**